## క్లుప్తంగా

### రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోండి



తెనాలిఅర్బన్: దుగ్గిరాల శుభం మహేశ్వరీ కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని పసుపు రైతుల సంఘం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ములకా శివ సాంబిరెడ్డిలు డిమాండ్ చేశారు. తెనాలి కొత్తపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కె జయజయరావును బుధవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాదెళ్ళ చంద్రశేఖర్, పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

### చింపయ్య మాస్టారుకు 'ఉపాధ్యాయరత్న'తో సత్కారం



తెనాలి: యునెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యంద్రపాటి చింపయ్యను 'ఉపాధ్యాయ రత్న' బిరుదుతో సత్కరించారు. గుంటూరులో మంగళవారం రాత్రి జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో చింపయ్యకు ఈ గౌరవం లభించింది. భట్టిప్రోలు మండల గ్రామం సూరేపల్లిలోని హైస్కూలులో లెక్కల మాస్టారుగా పనిచేసిన చింపయ్య శిష్యులు అప్పటి పరీక్షల్లో 90 శాతం పైగా మార్కులు సాధించారు. విద్యార్థులకు దేశభక్తిగేయాలను నేర్పుతూ పోటీలకు పంపేవారు. 2003లో రిటైరైన తర్వాత తెనాలిలో ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు దేశభక్తి గేయాలు నేర్పుతూ, క్విజ్ పోటీలకు శిక్షణనిస్తున్నారు. చింపయ్య కృషికి గుర్తింపుగా ఈ గౌరవంతో సత్కరించినట్టు యునెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షుడు రామనాథం పరమేశ్వరరావు వెల్లడించారు.

### మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం పంపిన నూతన వస్త్రాలను బుధవారం సాయంత్రం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్‌కు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు జతల వస్త్రాలు, టవల్స్ పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. కరోనా కారణంగా ఆప్కో సంస్థ వారు వీటిని అందజేయటంలో ఆలస్యం చేశారన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూషా, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు రామచంద్రరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### నందివెలుగులో అవగాహన సదస్సు



తెనాలి టౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో వికసిత్‌భారత్‌పై బుధవారం బీజేపీ నేతలు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాల గురించి కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కఠారు వాసుదేవనాయుడు, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్, బీసీ మోర్చా అధ్యక్షుడు ఎం.వీరయ్య, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు యోగానందకిషోర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపక్షాలన్నీ ఏకమైనా జగన్‌ను ఓడించలేవు

- నీతి మాలిన రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు
- సీఎం జగన్‌ను ఎదిరించలేక జనసేన, బీజేపీతో పొత్తు
- నాలుగో విడత వైఎస్సార్ చేయూత సంబరాలలో జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్



కొల్లిపర మండలంలో వైఎస్సార్ చేయూత మెగా చెక్కు అక్క చెల్లెమ్మలకు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రానున్న ఎన్నికల్లో విపక్షాలన్నీ ఏకమైనా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించలేవు.. ఎన్ని జెండాలు జత కట్టినా.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం.. అక్కచెల్లెమ్మల మోములో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం కొల్లిపర గ్రామంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత సంబరాలు నిర్వహించారు. మండలంలోని 2962 మంది మహిళలకు మంజూరైన రూ.5.55 కోట్ల చెక్కును జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా తో కలసి ఎమ్మెల్యే శివకుమార్ మహిళలకు అందజేశారు. సభ అధ్యక్షతగా ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ వహించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ హెనీక్రిస్టినా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలంటే మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం మహిళలకు ఇచ్చినప్పుడే కుటుంబంలో ఎటువంటి ఆర్థిక బాధలు ఉండవు అని భావించి ప్రతి సంక్షేమం మహిళలకు అందించడం జరుగుతుందని అందుకే జగనన్న మహిళ పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. మరో 40 రోజుల్లో రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మహిళలు కలసికట్టుగా ఉండి మళ్లీ తిరిగి ఎన్నుకోవాలని, తెనాలి ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్‌ని కూడా మళ్లీ అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన టీడీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు అన్న విషయం గుర్తు చేశారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్ట. ఇచ్చిన మాటపై చంద్రబాబు ఏనాడూ నిలబడలేదన్నారు. మళ్లీ అధికారం కోసం టీడీపీ, జనసేన నాయకులు కలసి చంద్రబాబు మాయ మాటలు చెప్పేందుకు వస్తారని తెలిపారు. వీరికి ప్రతి అక్కచెల్లెమ్మలు గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగితేనే ఓటు వేయమని సీఎం జగన్ చెబుతున్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ ఇలా చెప్పిన దమ్మున నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది సీఎం జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. సీఎం జగన్‌ను చంద్రబాబు ఎదిరించలేక జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుని మళ్లీ అధికారంలోకి రావటానికి నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబును ఓడిస్తే అబద్ధాల హామీలు చెప్పే టీడీపీ భూస్థాపితం అవుతుందన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా కొల్లిపర మండలంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, ఓసీలకు నాలుగేళ్లలో సుమారు 13 వేల మందికి రూ.22 కోట్లు నేరుగా అక్కాచెల్లెమ్మల ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. ఆసరా పథకం ద్వారా రూ.54 కోట్లు రుణమాఫీ చేయటం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పేదవాడికి సంక్షేమ దాతగా మారిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం అక్క చెల్లెమ్మలు ఎమ్మెల్యేతో కలసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, తెనాలి నియోజకవర్గ వైసీపీ ఎన్నికల పరిశీలకులు శేషగిరిరావు, ఎంపీపీ బీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు క్రిష్టారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఏపీఎం ప్రియదర్శిని, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు రిజిస్టర్ పత్రాల పంపిణీ

కొల్లిపర: పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా ఒక ఆస్తి రూపంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలను అందించడం దేశంలోని ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ,ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంలో మండలంలోని అన్ని గ్రామాలల్లో జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను స్థానిక జీవీఆర్ కల్యాణమండపంలో బుధవారం ఎమ్మెల్యే శివకుమార్, జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, తెనాలి నియోజకవర్గ వైసీపీ ఎన్నికల పరిశీలకులు శేషగిరిరావులతో కలసి ఆయా గ్రామ ప్రజా ప్రతినిధులతో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. సభకు అధ్యక్షతగా ఎంపీడీవో విష్ణుప్రసాద్ వహించారు. ఈ సభలో 2088 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలను ఇవ్వటం జరుగుతుందన్నారు. 2088 మందిలో 600 మంది ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నట్లు, మిగిలి వారు వివిధ నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపారు. 40 రోజుల్లో రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, శాసనసభ్యులుగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు శేషగిరిరావు, ఎంపీపీ బీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు క్రిష్టారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఏపీఎం ప్రియదర్శిని, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- తెనాలిలో నూతనంగా నిర్మించిన జిల్లా సత్వర చికిత్స కేంద్రం ప్రారంభం



జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: వైద్య, ఆరోగ్య శాఖలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని తమ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్ని వసతులు పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా వైద్యశాలలో అనేక ఇబ్బందులు ఉండేవన్నారు. వైద్యశాలలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే విధంగా జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. తానే దీనికి శంకుస్థాపన చేసి నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే పట్టణంలో డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను అయిదు ఏర్పాటు చేశామని, వాటిలో ఇప్పటి వరకు నాలుగు సెంటర్‌ల కోసం నూతన భవనాలు నిర్మించినట్లు చెప్పారు. మరో భవనం పనులు జరుగుతున్నాయని, దానిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. వీటి ఏర్పాటు వల్ల స్థానికంగా ఉన్న పేదలు అక్కడే వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. అలాగే వైద్యశాల ఆవరణలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర ప్రశాంత్, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మిలు మాట్లాడుతూ దీని నిర్మాణం కోసం రూ.1.33 కోట్ల నిధులు ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు వారికి అక్కడ వైద్య సేవలు అందింటం జరుగుతుందన్నారు. శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడే చిన్నారులకు ఇక్కడ చికిత్స అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ బాబు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఏవో డాక్టర్ మజీదా బేగం, ఆర్ఎంవో డాక్టర్ మస్తాన్‌వలి, డైక్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి



గీతాంజలి నివాసంలో కుటుంబ సభ్యులతో సీపీఎం నేతలు

తెనాలి: సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు మనస్తాపానికి లోనై జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి కుటుంబ సభ్యులను బుధవారం సీపీఎం పార్టీ నాయకులు పరామర్శించారు. ఇస్లాంపేటలోని వారి ఇంటికి వెళ్లారు. సోషల్‌మీడియాలో తనపై అసభ్యంగా కామెంట్లు పెట్టటాన్ని, దానిని జీర్ణించుకోలేక గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిన వైనాన్ని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల నాలుగో తేదీన తెనాలిలో ఇళ్లస్థలాల పట్టాలను రిజిస్ట్రేషను చేసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రిజిస్టర్డ్ పత్రాలను పంపిణీ చేశారనీ, ఆయన చేతులమీదుగా స్వయంగా పత్రాలను అందుకున్న సంతోషాన్ని సోషల్ మీడియాలో వ్యక్తపరచటంతోనే ట్రోలింగ్ జరగటం, ఆత్మహత్యకు పాల్పడటం జరిగిందని చెప్పారు. గీతాంజలి కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికసాయం ప్రకటించటం హర్షణీయమని సీపీఎం నేత ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ఆమె కుమార్తెలు రిషిత, రిషికల చదువులకు ప్రభుత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గీతాంజలిని సోషల్‌మీడియాలో వేధించిన, ఆమె మృతికి కారణమైన దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరిగే అరాచకాలను తమ పార్టీ ఖండిస్తుందని చెప్పారు. తొలుత గీతాంజలి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పార్టీ నేతలు షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్ ఉన్నారు.

### న్యాయం చేయాలంటూ ఆందోళన

తెనాలిరూరల్: కటుంబసమస్యలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన విష్ణు మొలకల శివశంకరారవు కటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ఆందోళనకు దిగారు. స్థానిక చెంచుపేటలో తెనాలి–గుంటూరు రహదారిపై బుధవారం రాత్రి రాస్తారోకో చేశారు. కుటుంబం ఆత్మహత్యాయత్నం చేయగా భార్య మృతి చెందిందని, వీరిని ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి విరమింపజేశారు. నాగమణి మృతదేహానికి పోస్టుమార్టమ్ జరిపించేందుకూ బంధువులు అంగీకరించలేదు. ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిని అరెస్టు చేసేవరకు పోస్టుమార్టం చేసేందుకు వీలు లేదని భీష్మించడంతో మృతదేహాన్ని మార్చురీలోనే ఉంచారు.

### మాజీ సీఎం సంజీవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయండి



కమిషనర్ శేషన్నకు వినతి పత్రం ఇస్తున్న రామకృష్ణ

తెనాలిఅర్బన్: తెనాలి బండ్‌పై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు దారా రామకృష్ణ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్నను బుధవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ చాంద్ భాషా, గొరికపూడి అశోక్, దాసరి ప్రభు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ కవాతు



రూట్ మార్చ్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బంది

తెనాలిరూరల్: గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు జరుగకుండ ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు ప్రజలకు సూచించారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని నందివెలుగు, కొలకలూరు, బుర్రిపాలెం గ్రామాల్లో రూరల్ పోలీస్ సిబ్బంది అలాగే సీఐఎస్ఎఫ్ బలగాలు కలిసి బుధవారం సంయుక్తంగా రూట్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుని సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు పోలీస్ రూట్ మార్చ్ చేసినట్లు తెలిపారు. అలానే వన్‌టౌన్ పోలీసులు నాజరుపేటలో మంగళవారం రాత్రి రూట్ మార్చ్ నిర్వహించారు.

# తెనాలిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు పార్కు

- ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- రాష్ట్రంలోనే ఇది ప్రథమమని వెల్లడి



పార్కును ప్రారంభించి, ఆడుతున్న పిల్లలతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: స్థానిక బాలాజీరావుపేటలో గల ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాల 'భవిత'ను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అక్కడి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పార్కును బుధవారం ప్రారంభించారు. భవిత పాఠశాలలో 29 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో బాలికలు తొమ్మిదిమంది ఉన్నారు. పిల్లల కాలకృత్యాలకు ఇబ్బందులు లేకుండా వెస్ట్రన్ వాష్‌రూమ్‌ను నిర్మించారు. 80అడుగుల పొడవు, 45 అడుగుల వెడల్పుతో పార్కును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆహ్లాదకర వాతావరణం కోసం సాధారణ మొక్కలే కాకుండా ఔషధ విలువలు కలిగిన మొక్కలను నాటారు. సిమెంటు బల్లలు, ఆడుకునేందుకు అనువైన పరికరాలను ఏర్పాటుచేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకోసం పార్కును రూపొందించటం రాష్ట్రంలోనే ఇదే ప్రథమమని చెబుతూ సహకరించిన దాతలకు ఎమ్మెల్యే శివకుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. 2019లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజైన డిసెంబరు 3న భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, అదేరోజున ఆ పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించినట్టు కార్యక్రమ పర్యవేక్షకుడు సునీల్ వెల్లడించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో రూ.1000 చొప్పున ఆహార కిట్ల పంపిణీ, తర్వాత టీవీ, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించారు. స్పెషలిస్టు డాక్టర్లతో తరచూ వైద్యశిబిరాలను నిర్వహిస్తూ వచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మొగల్ అహ్మద్, పాలడుగు రవీంద్రబాబు, జయనాగలక్ష్మి, భవిత టీచర్లు సునీత, రజిని, దేవరపల్లి భూషణం, రాజేంద్రకుమార్‌రెడ్డి, రాజేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సుందర తెనాలికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: సుందర తెనాలిని నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డులో బుధవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలని సూచించారు. ఆమె వెంట 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీర వసంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

### వృద్ధాశ్రమానికి రూ.25 వేల వితరణ



తెనాలి: పట్టణానికి చెందిన ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్, మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఇక్కడి శ్రీమహాత్మా సేవాశ్రమం తి ఆశ్రమానికి రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. తన తల్లి కొలసాని సీతారావమ్మ జ్ఞాపకార్థం ఆమె పేరిట ఆశ్రమానికి ఆర్థికసాయం చేసినట్టు గెలిపారు. పూజ్య బాపూజీ పేరుతో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారిని మానవత సంస్థ రీజినల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం అభినందించారు. కార్యక్రమంలో వీరితో పాటు మానవత సంస్థ బాధ్యులు తన్నీరు శ్రీనివాసబాబు, ఓంకార్ ప్రసాద్, డీవీ సోమయ్య శాస్త్రి, వెంకట్, ఎస్‌వీ శర్మ, పరిమి వాసు పాల్గొన్నారు.

### మారీసుపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న కౌన్సిలర్లు లక్ష్మి లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన గొల్తి గీతాంజలిని వేధించి ఆత్మహత్యకు కారణం అయిన టీడీపీ, జనసేన సోషల్ మీడియా ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెనాలి పట్టణ 23,24వ వార్డుల వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు తోక శిరిషా, పెదలంక లక్ష్మిలావణ్యలు డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి సంతాపంగా 23,24 వార్డుల వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మారీసుపేట, రెండు గేట్ల మధ్య నుంచి ఎస్‌సీఆర్ స్కూల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తుంటే ఓర్చుకోలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు కొందరు మహిళలపై సోషల్ మీడియాలో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా కించపర్చుతూ పోస్టులు పెడుతున్నారన్నారు. తెనాలిలో బీసీ మహిళ గీతాంజలిని కూడా ఇదే విధంగా వేధించి ఇబ్బందులకు గురిచేయటంతో ఆమె దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వరరావు, తోక వాసు, మేకల సురేష్, సుభాని, కృష్ణారెడ్డి, రాజేంద్ర, చెన్నయ్య, సిమోను, జానీ, రమాదేవి, పెదపూడి శిరిషా, భూలక్ష్మి, అరుణ, భాను, కుమారి, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

### సురక్ష క్యాంప్‌లను ఉపయోగించుకోండి



మహిళకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మౌనిక కుమార్

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను అందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని చుండూరి వారి సత్రంలో బుధవారం రెండొవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజల వద్దకే వైద్యులను తీసుకువచ్చి సేవలు అందించటం జరుగుతుందని చెప్పారు. డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక కుమార్ మాట్లాడుతూ జనరల్ ఓపీ 162, గైనకాలజీ -30, అస్తమాలజీ-38, ఆర్థోపెడిక్-35 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.లక్ష్మి సౌమ్య, డాక్టర్ హృషికేష్ పాండే, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఉమాకాంత్, వినోద్ కుమార్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### క్యాంపస్ రిక్రూట్ మెంట్‌లో 24 మంది ఎంపిక

తెనాలిఅర్బన్: ఐసీఐసీఐ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో జేఎంజే మహిళా కళాశాలలో జరిగిన క్యాంపస్ రిక్రూట్ మెంట్‌లో 24 మంది ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ తెలిపారు. వీటిని మంగళ, బుధవారాలలో నిర్వహించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థినులకు ఏడాదికి రూ.2.5 లక్షల వేతనం ఇస్తారన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల ఆవరణలో అభిందించారు. కార్యక్రమంలో ఐసీఐసీ బ్యాంక్ హెచ్ఆర్ సి.హెచ్.రాజేష్, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద మేరి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య పాల్గొన్నారు.

